తిరుమల తిరుపతి దేవస్థానములు

# బాల సప్తగిరి

సచిత్రమాసపత్రిక

ఏప్రిల్ 2020

సప్తగిరి అనుబంధం



## శ్రీరామ జయరామ జయ జయ రామ



బ్రహ్మోత్సవాలలో... బాలకళాకారులు

తిరుమల తిరుపతి దేవస్థానములు



# బాలసప్తగిరి

'సప్తగిరి' అనుబంధం

సంపుటి: 01 ఏప్రిల్ 2020 సంచిక: 02

## విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| హిందూదేవుళ్లు | ఆంజనేయుడు<br>డా॥ సముద్రాల దశరథ | 04 |
| పన్నిద్దరాళ్వార్లు | పూదత్తాళ్వారు (భూతాళ్వారు)<br>శ్రీ జటాధరాజ్ | 06 |
| కన్నడహరిదాసవరేణ్యులు | శ్రీపాదరాయలు<br>శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 08 |
| చిత్రకథ | గునపం చేసిన గాయం<br>కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: కె.ద్వారకనాథ్ | 10 |
| బాలనీతి | పరోపకారం<br>శ్రీ ఎమ్.రామక్రిష్ణయ్య | 14 |
| విశిష్టబాలుడు | | 16 |
| క్విజ్ | నిర్వహణ: శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి | 17 |
| చిత్రలేఖనం | | 18 |


ముఖచిత్రం : శ్రీకోదండరామస్వామివారు
వెనుక చిత్రం : బాలాంజనేయుడు


హిందూ దేవుళ్లు

# ఆంజనేయుడు

– డా॥ సముద్రాల దశరథ

కేసరి, అంజన ఇద్దరూ భార్యాభర్తలు. కేసరి సంసారంలో విసిగి తన భార్యకు వాయుదేవుని సేవిస్తూ ఉండమని చెప్పి తపస్సుకు వెళ్లాడు. అంజన భక్తికి వాయుదేవుడు ముగ్ధుడై ఆమెకు సుపుత్రుడు కలిగేట్లు దీవించాడు. అతడే ఆంజనేయుడు. ఆంజనేయునికి అనేక పేర్లున్నాయి. హనుమంతుడు, వాయుపుత్రుడు, మారుతి, అంజనాతనయుడు మొదలైనవి.

ఆంజనేయుడు బాల్యంలోనే ఉదయిస్తున్న సూర్యబింబాన్ని చూచి 'పండు' అని భ్రమపడి దానిని మ్రింగబోయాడు. అక్కడకు రాహువు వచ్చి ఆ బాలుని బెదిరించాడు. ఆ బాలుడు రాహువునే మ్రింగబోయాడు. ఐరావతమునెక్కి ఇంద్రుడు వచ్చి వజ్రాయుధంతో ఆ బాలుని హనువు (దవడ) పై కొట్టాడు. అపుడు ఆంజనేయుడు మూర్ఛిల్లాడు. అపుడే అతనికి హనుమంతుడనే పేరు వచ్చింది. కుమారునికి జరిగిన దానికి కోపంతో వాయుదేవుడు గాలిని బంధించాడు. పరిస్థితి భయంకరంగా మారింది. అపుడు దేవతలు ఇంద్రునితో గూడి



వాయుదేవుని ప్రార్థించారు. బ్రహ్మదేవుడు పవనసుతుని తన అమృత హస్తంతో తాకాడు. వెంటనే హనుమంతుడు లేచి కూర్చున్నాడు. అప్పుడు బ్రహ్మదేవుడు వాయుదేవునితో– నీ పుత్రుని ఆజ్ఞమేరకే మృత్యువు కూడా వస్తుంది. ఇతడు "చిరంజీవి" అని దీవించాడు.

ఆంజనేయుడు విద్య నార్జించుటకు సూర్యునిదగ్గరకు పోయాడు. నేనొకచోట ఉండను గదా! నాదగ్గర విద్య ఎలా నేర్చుకోగలవని సూర్యుడు ప్రశ్నించాడు? అపుడు ఆంజనేయుడు తూర్పున ఉదయాద్రిపై ఒక కాలు, పడమర అస్తగిరిపై ఒక కాలు ఉంచి నిలబడ్డాడు. అతని శక్తికి ఆశ్చర్య పోయి సూర్యభగవానుడు విద్య నేర్పుటకు ఒప్పుకొన్నాడు. ఆంజనేయుడు సూర్యుని ముందు నడుస్తూ విద్య నేర్చుకొన్నాడు.

ఆంజనేయుడు మొదటికలయికలోనే రాముని హృదయాన్ని ఆకర్షించాడు. ఋష్యమూకపర్వతంపై మొట్టమొదట రాముని కలసిన ఆంజనేయుడు "మీ ముఖారవిందాలు మీరు భూపతులనుగా తెలియజేస్తు న్నాయి. నేను సుగ్రీవుని సచివుడను" అనిన మారుతి మాటలను విని ఇతడు దూత అనే పదమునకు వన్నెతెచ్చువాడు అనుకున్నాడు రాముడు. ఆ తర్వాత లంకలో ఉన్న సీతను రాముని చెంతకు చేర్చుటానికి తనవంతు సహాయం చేశాడు. సీతారాముల ఆదరాభిమానాలను పొందాడు.

అయోధ్యలో శ్రీరామపట్టాభిషేకం జరిగిన తర్వాత హనుమం తుడు రాముని వద్దకు వచ్చి "రామా! నాకు నీయందు భక్తి చెదరకుండ ఉండునట్లు అనుగ్రహింపుము" అని అడిగాడు. అందుకు రాముడు లోకంలో నా గురించి చెప్పుకొనేంతకాలం నీ కీర్తిప్రతిష్ఠలు చెదరకుండా ఉంటాయని రాముడు ఆశీర్వదించాడు.

ఆంజనేయుడు భక్తుడు, రామదూత, పరాక్రమశాలి, కోరినవారి కోర్కెలు తీర్చేవాడు, అభయప్రదాత, పసిపిల్లలకు రక్షకస్థానం, కరుణా హృదయుడు, చిరంజీవి. అందరిచేత కీర్తింపబడుతూనే ఉన్నాడు.

పన్నిద్దరాళ్వార్లు


# పూదత్తాళ్వారు
## (భూతాళ్వారు)

- శ్రీ జటాధరాజ్

పూదత్తాళ్వారు సిద్ధార్థినామ సంవత్సరం, తులామాసం, ధనిష్ఠా నక్షత్రం, నవమీ బుధవారం రోజున జన్మించారు. వీరు మల్లాపురం (మహాబలిపురం) అనే దివ్యక్షేత్రంలో పుట్టారు. వీరు బండి గురిగింజ పుష్పంలో అవతరించారని తమిళప్రబంధం చెప్తోంది.


వీరికి ఈ పేరు రావడానికి కారణం– పూవులో జన్మించాడు కాబట్టి పూదత్తాళ్వారు అయి ఉంటాడు. పంచభూతాలయొక్క తత్త్వమెరిగినవారు కాబట్టి 'భూతాళ్వారు' అను నామము సార్థకమైంది.

వీరు విష్ణ్వంశసంభూతులు. విష్ణువు ఆయుధమైన 'కౌమోదకి' (గద) అంశతో జన్మించారు. 'గద' యుద్ధానికి సాంకేతికము. విశ్వం నందు ఒక శక్తికి మరియొకశక్తికి పోరాటం జరుగుతూనే ఉంటుంది. ఇందు భౌతికశక్తులకంటే నైతికశక్తులకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. మంచి ఎల్లప్పుడు చెడ్డను ఓడిస్తూనే ఉంటుంది అనేదే ఈ అంశ సారాంశం.



వీరు వైష్ణవభక్తాగ్రేసరులు. ఆళ్వార్లలో రెండవవారు. వీరు 'ఇరండాం తిరువందాది' అనే ప్రబంధాన్ని రచించారు. ఇందులో వంద పాశురాలున్నాయి. అందు తిరువేంగడం గురించి, అందున్న విష్ణువు గురించి ఎంతో గొప్పగా వర్ణించి

ఉన్నాడు. స్వామిని దర్శించాలన్న గట్టి సంకల్పంతో చెట్లనక, పుట్టలనక, ఎండకు, వానకు, గాలికి ఏమాత్రం జంకక అడవిలో క్రూర మృగాలను సైతం లెక్కచేయక అచంచల భక్తి విశ్వాసాలతో వెళ్లి దర్శించుకున్న మహనీయులు. ఆ వర్ణనంతా కూడా తన పాశురాల్లో కీర్తించాడు. ఆ ప్రబంధాన్నే తిరుమలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చిన్నశేషవాహనం, హంసవాహనసేవల్లో పారాయణం చేస్తారు.



వీరికి భూతముని, ద్వితీయయోగి, ఉత్పలముని అనే బిరుదులున్నాయి.

వీరు మొట్టమొదటగా పాడిన పాశురభావమిది.

నేను జ్ఞానదాయకమైన ద్రావిడరూప ప్రబంధకర్తను. నీ దాసుడను. నా భక్తిని ప్రమిదగా చేశాను. జిజ్ఞాసను నెయ్యిగా చేశాను. మనస్సును వత్తిగా భావించాను. నీవు జ్ఞానస్వరూపివి, ఆత్మస్వరూపివి. నిన్ను చూడ్డానికి పరభక్తిరూపమైన దీపాన్ని వెలిగిస్తున్నాను. ఈ వెలుగులో నాకు దర్శనమివ్వు తండ్రీ! అంటూ కీర్తించాడు. అంతటి పరమవైష్ణవ భక్తుడు పూదత్తాళ్వారు. ఆయనకు చేతులు జోడించి నమస్కరిద్దాం.

# శ్రీపాదరాయులు

కన్నడ హరిదాస వరేణ్యులు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

బాలలూ! మీరు 'బారోమనెగె గోవింద...', 'కంగళిద్దాతకో...', 'భూషణకే భూషణ......' మొదలగు సుప్రసిద్ధ కీర్తనలను సంగీత కచ్చేరీలలో, భజనలలో విన్నారు కదా! మరి అంత సుప్రసిద్ధమైన పాటలను ఎన్నో వ్రాసినవారు ఎవరో తెలుసా! వారిని గురించి తెలుసుకోవాలి కదా! వారెవరో కాదు సుమా! వారి పేరు శ్రీపాదరాయలు లేదా శ్రీపాదరాజులు.

వీరి మొదటిపేరు లక్ష్మీనారాయణ. వీరి తల్లిదండ్రులు గిరియమ్మ, శేషగిరిఆచార్యులు. మైసూరు దగ్గరున్న చెన్నపట్టణం వీరి ఊరు. లక్ష్మీనారాయణుడు చిన్నప్పుడు చాలా చురుకైనవాడు. మాటల నేర్పరి. ఆవులను దూడలను మేపుతూ- చిన్నప్పుడు తన లేత కంఠంతో పాట పాడుతూ ఉంటే ప్రకృతి పరవశించిపోయేది.



ఒకసారి స్వర్ణవర్ణతీర్థులనే స్వాములవారు ఈ బాలుని ముఖవర్చస్సు, మాటల చమత్కారమును చూచాడు. తన శిష్యునిగా చేసుకొన్నారు. ఉపనయనమైన తర్వాత గురువుగారే విద్య నేర్పారు. సంస్కృత కన్నడ ద్రవిడభాషలలో.. పండితుని గావించారు. వేదాంతశాస్త్రపాఠాలను బోధించారు. ద్వైతమత గ్రంథాలను చదివించారు. తన పీఠమునకు అన్నివిధాల తగిన వాడని భావించారు.

ఒక శుభముహూర్తంలో సన్యాసాశ్రమమును ఇప్పించి 'శ్రీపాద రాయలు' అని నామకరణం చేశారు.

అప్పటినుండి శ్రీపాదరాయలు సుధావేదాంతం మొదలు మరి కొన్ని గ్రంథాలు చదివారు. పాఠాలు చెప్పాడు. శ్రీరంగవిఠలమూర్తిని పూజించాడు. కీర్తనలు రచించాడు. వాటికి రాగం, తాళం ఏర్పాటు చేశాడు. కన్నడ హరిదాసులలో పేరు గాంచారు. భ్రమరగీత, గోపీ గీత, మధ్వనామాలు రచించారు, పాడారు. వాగ్గేయకారులయ్యారు.

వీరి కాలంలో చంద్రగిరిరాజు సాళువనరసింహరాయలకు బ్రహ్మహత్యాపాపం చుట్టుకొన్నదట. దానిని వీరు తమ తపశ్శక్తిచే పార ద్రోలారట. ఆ రాజు అందుకు వీరికి గొప్పగా సన్మానం చేశారట.

నాలుకతో నారాయణమంత్రం పఠించాలి. కాళ్లతో తీర్థయాత్రలు చేయాలి. ఆలయంలో బృందావనం నిర్మించాలి. విష్ణుకథలు వినాలి. చేతులతో దానం చేయాలి. మనిషికి మానం ముఖ్యం. మునులు మౌనంగా ఉండాలి. కనులతో రంగని దర్శించాలి. శిరస్సును నమస్కారం చేసేందుకు వాడాలి. మెడలో తులసిమాల ధరించాలి అంటారు శ్రీపాద రాయలు.

'హరే వేంకట శైల వల్లభపొరెయబేకు ఎన్న' అని శ్రీనివాసుని మీద వీరు వ్రాసిన పాట సుప్రసిద్ధం.

వీరి బృందావనం.. కోలార్ జిల్లా ముళబాగిలులో ఉన్నది.





చిత్ర కథ

# గునపం చేసిన గాయం


కథ- డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- కె.ద్వారకనాథ్


పుష్పప్రియుడు శ్రీవేంకటేశ్వరుడు. కానీ, కొండమీద సమృద్ధిగా పూలు దొరకటం లేదు. ఆ కొరత తీర్చాలని శ్రీరామానుజులు ఆలోచించి తన శిష్యులందరినీ పిలిపించారు.





నేను సిద్ధం ఆచార్య!
నాయనా! నీకు నా మంగళాశాసనాలు!!
భార్యను వెంటబెట్టుకుని కొండకి చేరాడు అనంతాచార్యులు. తోటకి నీళ్ల కావాలి కనుక ముందుగా బావిని తవ్వటం ఆరంభించాడు. భర్త మట్టిని తవ్వుతుంటే గర్భవతి అయిన తన భార్య ఆ మట్టినంతా తట్టతో బయట పోస్తోంది. వాళ్లని చూసిన స్వామికి జాలి కలిగి బాలుని రూపంలో వచ్చి....
అయ్యా! నేను కూడా మట్టిని మోస్తాను.
ఎవరి సాయమూ మాకొద్దు.. పో...
అమ్మా! తట్టని ఇలా ఇవ్వు. నేను మోస్తానుగా..
సరే... తీసుకో నాయనా! ఈ తట్టను..


తన మాట వినకుండా మట్టిని మోస్తున్న బాలుణ్ణి కసురుకున్నాడు అనంతుడు.
మాకు నీ సాయం అక్కర్లేదని చెప్పానా.. ఇక్కడి నుంచి పో.. పోతావా..! పోవా...!!
కొడతావా ఏంటీ?
అంటూ.. ఆనందనిలయం వైపు పరుగుతీశాడు బాలుడు.
ఆకతాయీ! ఆగు... ఆగు.. అంటూ కోపంతో గునపాన్ని విసిరాడు అనంతుడు.
తాతా! నేను ఆగను.. ఆగనంటే.. ఆగను...!
అనంతాచార్యులు విసిరిన గునపం బాలుని గడ్డానికి తగిలి రక్తం చిమ్మింది.
అబ్బా! నొప్పి.. నొప్పి..
అంటూ గుళ్లోకి పారిపోయాడు బాలుడు. అతని వెనకే అనంతుడూ వెళ్లాడు. అక్కడ బాలుడు కనిపించలేదు. ఎదురుగా నెత్తురు కారుతున్న గాయంతో స్వామి కన్పించాడు.
స్వామీ! నిన్నా నేను కొట్టింది. ఎంత పాపాత్ముణ్ణి..


స్వామీ! అపచారం జరిగింది..
నన్ను శిక్షించు!
అనంతా!
నీవు ఏమాత్రం బాధపడవద్దు.
ఈ గాయం నీ భక్తికి
నిదర్శనంగా నిలుస్తుంది.
ఇంతలో శ్రీవారి అర్చకులు వచ్చి
స్వామి గడ్డానికి పచ్చకర్పూరం అద్దడంతో
రక్తం కారడం ఆగిపోయింది.
అనంతా! నా ఈ గడ్డం మీది పచ్చకర్పూరపు
చుక్కను చూసి ముందు తరాల వాళ్లు
నీ అనన్య భక్తిని కీర్తిస్తారు సుమా!
ఆనందంతో
అనంతుని
కుటుంబం
భక్తితో
స్వామికి
నమస్కరించింది.
ఓం నమో
వేంకటేశాయ!
వచ్చే సంచికలో శ్రీవేంకటేశ్వరుని మరో దివ్యలీలా విలాసం....
స్వస్తి!




# పరోపకారం

- శ్రీ ఎమ్.రామక్రిష్ణయ్య

ఇతర స్త్రీలను, ఇతరుల సిరిసంపదలను ఆశపడనివారు, మోసం చేయనివారు తనలో స్నానం చేస్తే తాను పవిత్రురాలను అవు తాను అని గంగామాతే చెప్పింది. అలాంటివారే సామాజికశాంతిని పెంపొందింపజేస్తారు.

మంచి ఏదో చెడు ఏదో పిల్లలకు పెద్దలు నేర్పితే వారు చిన్నప్పటి నుండీ కడదాకా వాటినే ఆచరించగల్గుతారు. మంచి అంటే ఇతరులను చూసి అసూయపడకుండా ఉండటం, వారి వస్తువులను దొంగలించ కుండా ఉండటం లాంటివి. ఇటువంటి ధర్మాలను అనుసరించేవారిని చూసి కూడా అనుసరించే గుణాన్ని మనం అలవర్చుకోవాలి.

అందుకో చిన్నకథ రామాయణం నుంచి తెలుసుకుందాం.

సంపాతి, జటాయువులు అన్నదమ్ములు. ఇద్దరూ ఎప్పుడూ ఆనందంగా ఆకాశంలో విహరిస్తూండేవారు. ఓ రోజు ఇద్దరూ సూర్య మండలం దాకా ఎవరు ఎగురగల్గుతారు అని పందెం వేసుకున్నారు.

అలా ఎగురుతూ తమ్ముడైన జటాయువు సూర్యునివేడిని తట్టు కోలేక స్పృహ తప్పి భూమిపై పడిపోసాగాడు. అలా పడిపోతున్న తన తమ్ముణ్ణి సంపాతి తన రెక్కలను అడ్డుపెట్టి నీడ కల్పించి రక్షించాడు. ఆ సమయంలో సంపాతి రెక్కలు పూర్తిగా కాలిపోయాయి.

అలా రెక్కలు పోయిన తర్వాత సంపాతి వింధ్యపర్వతంమీదే ఉండిపోయాడు. అలా తనకు సహాయంచేసిన అన్నను చూచి జటాయువు

ఇక మీదట నా అన్నలాగే నేను కూడా మంచి మార్గంలో వెళ్తూ ఆపదలో ఉన్నవారిని కాపాడాలని తీర్మానించుకుకున్నాడు.

అలా ఓ రోజు రావణాసురుడు రాముడి భార్య సీతమ్మను బలవంతంగా తీసుకెళ్లడం చూశాడు జటాయువు. ఎన్నో ధర్మసూక్ష్మాలు చెప్పాడు. తనకు శక్తి లేకపోయినా వీరోచితంగా పోరాడాడు. అవన్నీ... విన్నా కూడా రావణాసురుడు ఏమాత్రం మారక జటాయువును బలంగా తోసేసి సీతమ్మను తీసుకువెళ్లిపోయాడు.




ఐనా... జటాయువు రాముడు వచ్చేంత వరకు తన ప్రాణాలు నిలుపుకొన్నాడు.

వారు వచ్చిన తరువాత సీతమ్మ విషయం వారికి చెప్పి కన్నుమూశాడు. ఇదంతా కూడా తన అన్నను చూసి నేర్చుకున్నదే!

ఇలా కుటుంబంలో ఉన్న పెద్దలు మంచిమార్గంలో ఉంటూ పిల్లలకు నేర్పినట్లైతే వారు భవిష్యత్తులో ఉత్తమ శీలవంతులుగా, త్యాగనిరతులుగా, మంచిపౌరులుగా ఎదుగుతారు. పరోపకారగుణం కూడా అలవడుతుంది.



# విశిష్టబాలుడు

| | | |
|---|---|---|
| పేరు | - | ఇ.సాయియశస్వి |
| **తరగతి** | - | 5వ తరగతి |
| **పుట్టిన తేది** | - | 18-11-2009 |
| **తండ్రిపేరు** | - | ఇ.వెంకటరమేష్, ఇండియన్ ఆర్మి |
| **తల్లిపేరు** | - | డి.శ్రీదేవి, తి.తి.దే. |
| **పాఠశాల** | - | మేక్ మై బేబి జీనియస్, తిరుపతి. |

**01)** వేమన శతకరత్న - 3వ తరగతి

**02)** ఆవర్తనపట్టికలోని 118 మూలక విషయజ్ఞ - 4వ తరగతి

**03)** 108 యోగాసన ప్రవీణ - 4వ తరగతి

**04)** 100 ఎక్కాలు క్షణిక గణికోత్తమ - 4వ తరగతి

**05)** 100కు పైగా ఒరిగామి వండర్ కిడ్ - 4వ తరగతి

**06)** టాన్‌గ్రామ్ వండర్ కిడ్ - 4వ తరగతి

**07) జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్**

100 వేమన పద్యాలు-100 మంది- 25 ని॥లు- 01-06-2016

100 వేమన పద్యాలు-200 మంది- 25 ని॥లు- 05-06-2017

100 వేమన పద్యాలు-300 మంది- 25 ని॥లు- 03-06-2018

**08) వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్**

100 వేమన పద్యాలు-300 మంది- 03-06-2018

**1)**రూబిక్యూబ్ **2)**జగిళింగ్ బాల్స్ **3)**మైక్రో ఆర్ట్ **4)**డ్రాయింగ్ **5)**స్కేటింగ్ **6)**భగవద్గీత **7)**విష్ణుసహస్రనామాలు **8)**గోవింద నామాలు **9)**లింగాష్టకం **10)**బ్రీత్‌లెస్‌సాంగ్

# క్విజ్

**నిర్వహణ-**
**శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి**

**1) శ్రీరాముడు ఎన్ని ఏండ్లు అరణ్యవాసం చేశాడు?**

అ) పద్దెనిమిది ఆ) పదహారు
ఇ) పద్నాలుగు ఈ) పన్నెండు

**2) 'భాష్యకార్లు' అని ఎవరికి పేరు?**

అ) నమ్మాళ్వారు ఆ) రామానుజులు
ఇ) తిరుమలనంబి ఈ) అనంతాళ్వారు

**3) విష్ణువే సత్త్వగుణం కల్గినవాడని చెప్పింది ఎవరు?**

అ) దుర్వాసుడు ఆ) కశ్యపుడు
ఇ) విశ్వామిత్రుడు ఈ) భృగువు

**4) 'ఫల్గుణీతీర్థం' అని దేనికి పేరు?**

అ) స్వామిపుష్కరిణి ఆ) శ్రీరామకృష్ణతీర్థం
ఇ) తుంబురుతీర్థం ఈ) కుమారధారతీర్థం

**5) పరశురాముడి తండ్రి ఎవరు?**

అ) జమదగ్ని ఆ) అత్రి
ఇ) గౌతముడు ఈ) వసిష్ఠుడు

**6) 'ఏకశిలానగరం' అని దేనికి పేరు?**

అ) వాల్మీకిపురం ఆ) ఒంటిమిట్ట
ఇ) తిరుపతి ఈ) భద్రాచలం

**7) వసంత+ఉత్సవం=వసంతోత్సవం (ఏ సంధి)?**


అ) సవర్ణదీర్ఘసంధి ఆ) అకారసంధి
ఇ) గుణసంధి ఈ) త్రికసంధి

**జవాబులు**

1) ఇ 2) ఆ 3) ఈ 4) ఇ 5) అ 6) ఆ 7) ఇ

# చిత్ర లేఖనం

ఈ బొమ్మకు
రంగులు వేద్దామా...



పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...



బ్రహ్మోత్సవాలలో... బాలకళాకారులు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-03-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742.
Postal Regd.No.TRP/10- 2018-2020, Licensed to post without prepayment
No.PMGK/RNP/WPP-04/2018-2020




అంజనీసుతుడు